నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | మార్చి 28, 2025 | www.navatelangana.com

ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించినట్లు ఏపీఎం రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని ధర్మారావుపేట్, కుప్రియాల్, అమర్లబండ గ్రామాల్లో కేంద్రాలు ఐకేపి ద్వారా కొనుగోలు చేయాలని ఆదేశించినట్టు వివరించారు. అలాగే తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని, ఎన్పీఏ ఉన్న సంఘాలకు ఫోకస్ చేయాలని అన్నారు. అన్ని గ్రామ సంఘాలు తమ విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల అధ్యక్షురాలు, సీసీలు సూపర్వైజర్ లత, డీఎం రామచంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పలువురు

గంజాయి మొక్కలు ధ్వంసం

- నాటుసారా పట్టివేత

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని జెమినీ తండాలో 10 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని దారావత్ హనుమాను అనే వ్యక్తిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. అదేవిధంగా జెమిని తండాలో రెండు లీటర్ల సారాను సీజ్ చేసి, బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్టు ఆబ్కారీ సీఐ ఎల్లారెడ్డి షాకీర్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న, నిజామాబాద్, ఎస్సై జగన్ మోహన్, ఎల్లారెడ్డి సిబ్బంది కానిస్టేబుల్‌లు రవీందర్‌రెడ్డి, రజిత, స్రవంతి, లావణ్య పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాల్ ప్రాక్టీస్‌కు ప్రయత్నించిన ఘటనలో
11 మందిపై కేసు నమోదు

- ముగ్గురు పరారీలో..
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ మండలంలో బుధవారం జరుగుతున్న పదవ తరగతి గణితం పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు ప్రయత్నించిన కేసులో 11 మందిపై కేసు నమోదు కాగా 8 మందిని అరెస్టు చేశామని ముగ్గురు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 64 సెంటర్లలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్న సమయంలో జుక్కల్ జిల్లా పరిషత్ హైస్కుల్లో కొంతమంది మాల్ ప్రాక్టీస్ చేసే ప్రయత్నం చేయగా వెంటనే డీఈఓ, పోలీసులు కలిసి ప్రయత్నాన్ని విఫలం చేశారని ఆయన తెలిపారు. ఇందులో కీలకపాత్ర పోషించిన 8 మందిని అరెస్టు చేసి వారిని జువైనల్ కోర్టులో హాజరు పరచనున్నట్టు పేర్కొన్నారు. జుక్కల్‌లో మాల్ ప్రాక్టీస్‌కు యత్నించిన ఘటనలో 11 మందిపై కేసు నమోదైందని.. వీరిలో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. అరెస్టు చేసిన ఎనిమిది మందిలో ఇద్దరు విలేకరులు కూడా ఉన్నారన్నారు.

ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాల పరీక్ష కేంద్రంలో గణితం పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థికి సబ్జెక్టు సరిగ్గా రాదు. దీంతో విద్యార్థి తండ్రి పాఠశాలలో వాటర్ సప్లయ్ చేస్తున్న ఓ వ్యక్తితో మాటలతో మచ్చిక చేసుకుని.. అతనికి ఓ తెల్ల కాగితం ఇచ్చి తన కొడుకు వివరాలు చెప్పి ప్రశ్నలను రాసుకుని రావాలని పంపించాడు. తెల్ల కాగితాన్ని సదరు వ్యక్తి విద్యార్థికి ఇచ్చాడు. కాసేపటికి 5 ప్రశ్నలతో కూడిన కాగితాన్ని ఆ విద్యార్థి సదరు వ్యక్తి అందించాడు. అతను ఆ కాగితాన్ని తిరిగి విద్యార్థి తండ్రికి ఇచ్చాడు. అనంతరం విద్యార్థి తండ్రి ఆ పేపర్‌ను గ్రామ పంచాయతీ కారోబార్‌కు ఇచ్చి జవాబులు తేవాలని చెప్పాడు. ఆ పేపర్‌ను ఫొటో తీసుకున్న కారోబార్ అక్కడే ఉన్న విలేకరికి పంపించాడు. అలాగే ఆ పేపర్ కారోబార్ నుంచి ఓ యూట్యూబ్ రిపోర్టర్‌కు చేరగా అతని నుంచి మరో రిపోర్టర్‌కు వాట్సాప్‌లో పంపారు. సదరు విలేకరి ఆ పేపర్‌ను ఓ క్లిప్పింగ్ తయారు చేసి లోకల్‌గా ఉన్న డిజిటల్ మీడియా గ్రూపులో షేర్ చేశాడు. తర్వాత ఓ మైనర్ బాలుడు పరీక్ష కేంద్రానికి వెళ్లి మరొక మైనర్ బాలుడి ఫోన్ నుంచి ప్రశ్నలతో కూడిన పేపర్‌ను ఫొటో తీసి కారోబార్‌కు పంపించి డిలీట్ చేశారు. పోలీసులు ఈ విషయాన్ని గుర్తించి ప్రశ్నలు బయటకు వెళ్లకుండా విచారణ చేపట్టి 8 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఓ యూట్యూబ్ ఛానల్ విలేకరితో పాటు, వాట్సప్ గ్రూప్ అడ్మిన్, మరో మైనర్ పరారీలో ఉన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఎస్‌బీ సీఐ తిరుపయ్య పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

మాస్ కాపీయింగ్‌కు పాల్పడినా..
ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదు..

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ-బిచ్కుంద

జుక్కల్ మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షా పత్రం లీక్ కావడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని.. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన వారిని ప్రోత్సహించినా.. ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం ఫోన్ ద్వారా మీడియా ప్రతినిధులకు మాట్లాడుతూ.. పేపర్ లీకేజ్ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి వరకు వెళ్లినందున పేపర్ లీకేజీకి పరోక్షంగా ప్రత్యక్షంగా సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదేశించినట్టు తెలిపారు. యూట్యూబ్ ఛానల్, మీడియా ప్రతినిధులం, రిపోర్టరం అంటూ కొందరు పదవ తరగతి ప్రశ్నాపత్రం ఫోటో తీసి వైరల్ చేయడం చాలా బాధాకరమైన విషయమని మీడియా అంటే సమాజంలో బాధ్యతగా ఉండాల్సింది పోయి.. ప్రశ్నాపత్రాల ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేయడం నేరంగా భావించాలన్నారు. వారు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. మాల్ ప్రాక్టీస్ పేపర్ లీకేజీ చేయవద్దని, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరించినా ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. మాస్ కాపీయింగ్ పాల్పడినవారు వారికి సహకారం అందించిన వారిపై అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.


ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విద్యా బలోపేతానికి కృషి..

జుక్కల్ నియోజకవర్గంలో విద్యను బలోపేతం చేసి అందరికీ విద్య అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇంటిగ్రేటెడ్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, బిచ్కుందలో ఐటీఐ కాలేజ్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేయించి వాటి నిర్వహణకు కోట్ల నిధులు తీసుకు వచ్చినట్టు పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్య అందరికీ అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తుంటే కొందరు ప్రశ్నపత్రాలు లీక్‌కు పాల్పడడం సమంజసం కాదన్నారు.

ఎన్సిడి స్క్రీనింగ్ పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సిడి జిల్లా కోఆర్డినేటర్ ఊహశ్రీ గురువారం పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే రోగులతో వైద్యులు అందజేస్తున్న వైద్య సదుపాయాలు, మందుల పంపిణీ వివరాలు, చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్స అందజేయాలని మెడికల్ అధికారి యేమిమాకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వెంకటరమణ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

- నగదు, వెండి రికవరీ
- ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్

నవతెలంగాణ-లింగంపేట్

దొంగతనం కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్టు ఎల్లారెడ్డి రవీందర్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్లో రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నల్లమడుగు గ్రామానికి చెందిన ఎత్తం సిద్దయ్య ఈనెల 19న దొంగతనం జరిగిందని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించారు. కన్నాపూర్ గ్రామానికి చెందిన గ్యారబోయిన శ్రీకాంత్ ఈనెల 19న నల్లమడుగు గ్రామంలోని సిద్ధిరాములు ఇంటికి కూలి పని కోసం వెళ్లి సిద్ధిరాములు ఇంట్లో దొంగతనం చేసినట్టు గుర్తించి గురువారం సాయంత్రం పోల్కంపేట్ చౌరస్తాలో నిందితుని పట్టుకొని అతని వద్ద నుండి 17 వేల రూపాయల నగదు, బైకు, సెల్ ఫోన్, వెండి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యక్తి పలు నేరాలలో నిందితుడిగా ఉన్నారు. సమావేశంలో ఎస్ఐ ప్రకాష్, సిబ్బంది రమేష్ రెడ్డి, కాషాగౌడ్, మదన్, శంకర్, రాజయ్య తదితరులున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నేరాలపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం ప్రతినిధులు

నవతెలంగాణ-రాజంపేట్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాబృందం సూచించింది. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో ఇంటికి వెళుతున్నప్పుడు అపరిచిత వ్యక్తులతో (గుడ్ టచ్ బ్యాడ్ టచ్) విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చెరువులకు ఈతకు వెళ్లి ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దని అన్నారు. సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, రాజంపేట పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రత్యేక అధికారి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షులు ఏ.రమేష్ బాబు
- సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా
- మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షులు ఏ.రమేష్ బాబు అన్నారు. గురువారం తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎ.రమేష్‌బాబు ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కేటగిరీల వారీగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. ఇటీవల 69 జీవోను అనుసరించి కార్మికుల వేతనాలు తగ్గిస్తామని అధికారుల ప్రచారం మూలంగా కార్మికులలో తీవ్ర మానసిక ఆందోళన పెరుగుతుందని, ఇది సరైన విధానం కాదని చట్ట వ్యతిరేకమని అందువల్ల వేతనాలను తగ్గించ కూడదని పేర్కొన్నారు. అదేవిధంగా డ్రైవర్లకు ప్రభుత్వం గతంలో పెంచిన వెయ్యి రూపాయలను అమలు జరపాలని డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున కార్మికులకు 11 గంటల వరకే విధులు నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచని యెడల ఆందోళనను ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు కే.భూపతి, ప్రధాన కార్యదర్శి ఏకనాథ్, పుణ్య నాయకులు శివ, సంజీవ్, శ్యామ్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉద్యోగుల సస్పెండ్

- జిల్లా విద్యాశాఖ అధికారి రాజు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు తెలిపారు. బుధవారం జరిగిన గణిత పరీక్ష జుక్కల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జుక్కల్ పరీక్షా కేంద్రం నుంచి పరీక్ష ప్రశ్నాపత్రంలోని కొన్ని ప్రశ్నలను కాగితంపై రాసి బయటకు పంపించడం జరిగిందని సామాజిక మాధ్యమాలలో బయటకు వచ్చిన సందర్భంగా సబ్ కలెక్టర్, బాన్సువాడ, తహసిల్దార్ జుక్కల్, మండల పంచాయతీ అధికారి, జుక్కల్ మండల విద్యాధికారి జుక్కల్, పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ ఎం.సునీల్, వి.భీమ్, దీపికను విధుల నుంచి సస్పెండ్ చేశారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్లపైనే వాహనాలు పార్కింగ్

- బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు


రోడ్డుపై నిలిపిఉంచిన వాహనాలు.. బస్సు వెళ్లేందుకు ఇబ్బందులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో బస్టాండ్ నుంచి బాన్సువాడ, కామారెడ్డి బస్సులు వెళ్లే వైపు రోడ్లపైనే వాహనాలు నిలిపివేయడంతో కామారెడ్డి, బాన్సువాడ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. టర్న్ అవ్వడానికి స్థలం లేకపోవడంతో బస్సులు నిలిపివేస్తున్నారు. నిలిపివేసిన వాహనాలను తీస్తేనే ఆర్టీసీ బస్సు కదిలే పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

- మండల ప్రత్యేకాధికారి, జెడ్పి సీఈఓ చందర్ రాథోడ్

నవతెలంగాణ-జుక్కల్

అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పి సీఈఓ చందర్ రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని బంగారుపల్లి గ్రామంలో జుక్కల్ మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈఓ చందర్ నాయక్ గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ మండలంలో 30 గ్రామ పంచాయతీలున్నాయని ఒక్కొక్క పంచాయతీకి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నుంచి సిసి రోడ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. గ్రామాలలో నూతనంగా సిసి రోడ్లు ఇప్పటికే వేశారని, వాటి నాణ్యతను పరిశీలించారు. ప్రస్తుతం మిగిలిపోయిన గ్రామాలు ఇంకా రోడ్లు వేసే కార్యక్రమం కొనసాగుతోందని ఆయన అన్నారు. అదేవిధంగా జిపి కార్యదర్శులు గ్రామాలలో గ్రామ శుభ్రత పాటించాలని ప్రజలకు ఈ అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వారి సమస్యలు పరిష్కరించి గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని సూచించారు. బంగారుపల్లి గ్రామంలో గ్రామస్తులతో మమేకమై మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో పేరుకుపోయిన ఇంటి పన్నులు, నల్ల బిల్లులు 100శాతం వసూలు చేయాలని, గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఎప్పటి కప్పుడు పూర్తిచేసి ఉంచాలని ఆయన జిపి సెక్రెట రీలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్య వేక్షించి వాటి వివరాలను అందుబాటులో ఉంచాలని జుక్కల్ ఎంపిడిఓకు సూచించారు. ఆయన వెంట జుక్కల్ ఎంపిడిఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల జిపి కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో చందర్ రాథోడ్

కుస్తీమే సవాల్


కుస్తీపడుతున్న మల్లయోధులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బోనాల్ గ్రామంలో గురువారం కుస్తీ పోటీలను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ప్రభు స్వామి ఉత్సవాల్లో భాగంగా జాతర ఉత్సవాల ముగింపులో భాగంగా మధ్యాహ్నం నుండి కుస్తీ పోటీలను నిర్వహించారు. టెంకాయ కుస్తీ నుంచి మొదలుకొని వెండి కడియం వరకు కుస్తీ పోటీలో ఏర్పాటు చేశారు. ఇతర మండలాలతో పాటు దూర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ప్రజలు ఆసక్తితో కుస్తీ పోటీలో తిలకించారు. విజేతలకు బహుమతులను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు.

మందలుగా కుక్కలు

- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో 10 నుంచి 20 శునకాలు ఒకేసారిగా గ్రామంలో సంచరిస్తూ ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా రోడ్డుపై సంచరించడంతో కాలినడకన వెళ్లే ప్రజలతోపాటు, ద్విచక్ర వాహన దారులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజలతో పాటు గ్రామంలో పెంచుకున్న కోళ్లపై సైతం అవి దాడి చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



విజయ డెయిరీకి రూ.100 కోట్లు విడుదల పట్ల హర్షం

నవతెలంగాణ-సదాశివనగర్

విజయ డెయిరీకి రూ.100 కోట్లు విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర సమాఖ్య అధ్యక్షులు గుత్త సుమిత్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి చంద్రశేఖర్ రెడ్డి, కామారెడ్డి విజయ డెయిరీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల విజయ డైయిరీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

- సూపర్వైజర్ ఒత్తిడి భరించలేక ఫినాయిల్ తాగిన టీచర్


అంగన్‌వాడీ టీచర్‌ను పరామర్శిస్తున్న సీఐటీయూ నేత ఖలీల్

నవతెలంగాణ-కామారెడ్డిడెస్క్

కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలోని బొమ్మన్ దేవ్‌పల్లి గ్రామంలో సువర్ణ అనే అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం చేసింది. అంగన్వాడీ సూపర్‌వైజర్ వాణి ప్రతి చిన్న విషయానికి సువర్ణను వేధిస్తోందని, పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఆమెపై చర్యలు తీసుకోలేదని, ఆమె వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపింది.

వివరాలు మెయిన్‌లో..

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-మోర్తాడ్
మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో గురువారం ఎంపీడీవో తిరుమల చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజలు వేసవికాలం సందర్భంగా నీటిని పొదుపుగా వాడాలని ప్రజలకు, ప్రయాణికులకు దాహార్తి తీర్చడానికి గ్రామస్తులు ఏర్పాటు చేసిన చలివేంద్రం ఆమె ప్రారంభిస్తూ మాట్లాడారు. గ్రామంలో కులాయినీరు పొదుపుగా వాడాలని, వాడిన అనంతరం కులాయి టాప్ బంద్ చేసి నీటిని నిలువ ఉండేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కరుణ ట్రస్ట్ చైర్మన్ తుమ్మల మహేష్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్



నవతెలంగాణ-భీంగల్ రూరల్
భీంగల్‌లోని అంగడి బజార్ వద్ద గురువారం 6 గంటల సమయ ప్రాంతంలో వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి ఆ ట్రాక్టర్ భీంగల్ గ్రామానికి చెందిన గంగారపు లింబాద్రి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారు. ఆ ఇసుకకు సంబంధించిన పర్మిషన్ పత్రాలను పోలీసులు అడుగగా ఎలాంటి పత్రాలు చుపించనందున అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ గంగారపు లింబాద్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జి.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పర్మిషన్ పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

మస్టర్లను సక్రమంగా రాయాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-మోర్తాడ్
మండలం శెట్‌పల్లి గ్రామ ఊర చెరువులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో తిరుమల గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ పనుల మస్టర్లను సక్రమంగా రాయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఎలాంటి తప్పులు జరగకుండా కూలీల రికార్డులను సక్రమంగా నమోదు చేసి వారికి డబ్బులు వచ్చే విధంగా ఎప్పటికప్పుడు ఆన్లైన్ నమోదు చేయాలని అన్నారు. అనంతరం నర్సరీలో మొక్కలను పరిశీలించారు. వేసవికాలం సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉదయం సమయంలోనే పనులు కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని, కూలీలకు అవసరమైన తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆమె వెంట గ్రామ కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

చిందు కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్
లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాతపురం ఆధ్వర్యంలో "ప్రపంచ రంగస్థల దినోత్సవం" సందర్భంగా పట్టణంలో లో ప్రఖ్యాత చిందు భాగవత కళాకారులను సన్మానించి పారితోషికం అందజేసినట్టు గురువారం అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతరించిపోతున్న చిందు భాగవతం కళను ఇంకా బతికించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి నారాయణ గౌడ్ సభ్యులు తిరుపతి, జ్ఞాని చావ్లా, శశిధర్ రెడ్డి, చిందు కళాకారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభం


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన కాంక్రీట్ సిమెంట్ రోడ్ల నిర్మాణం పనులను కమ్మర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య గురువారం ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.40లక్షలతో ఈ కాంక్రీట్ సిమెంట్ రోడ్ల నిర్మాణాలను చేపట్టారు. సిమెంటు రోడ్ల నిర్మాణానికి చైర్మన్ నర్సయ్య కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో కాంక్రీట్ సిమెంట్ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కాంక్రీట్ సిమెంట్ రోడ్ల పనులు మంజూరు చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని పలు కాలనీలో కాంగ్రెస్ సిమెంట్ రోడ్ల నిర్మాణం పట్ల ప్రజల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, సీనియర్ నాయకులు నూకల బుజ్జి మల్లయ్య, నాయకులు వేముల గంగారెడ్డి, పూజారి శేఖర్, గడ్డం నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక పాయింట్‌ను పరిశీలించిన అధికారులు


ఇసుక పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని చిక్లి, గుంజిలి, వల్లభాపూర్ గ్రామాల్లోని పెద్దవాగులో గల ఇసుకను అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు కలిసి వాగులోగల ఇసుకను ప్రభుత్వ పథకాలకు ఉపయోగించడం కోసం ప్రభుత్వ పాయింట్ ఏర్పాటు చేయడానికి అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీ, సర్వేయర్ కిషన్ నాయక్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మూగజీవాలకు కొత్త రకం వ్యాధి

- స్కిన్ ఎలర్జీతో కుక్కలకు రాలుతున్న చర్మం
- చికిత్స అందించాలంటున్న గ్రామస్తులు
- ఆందోళన వద్దు : పశువైద్యులు

నవతెలంగాణ-ముప్కాల్
ఒకవైపు వ్యర్థ పదార్థాల ఆహారం, మరోవైపు వాతావరణం దృష్ట్యా స్కిన్ ఎలర్జీతో మూగజీవాలు కొత్త రకం రోగాల బారిన పడుతున్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని ప్రతి గ్రామంలో 100 శునకాలు ఉంటే అందులో 10 నుంచి 15 వరకు శునకాలు వాటి శరీరంపై బొచ్చు తొలిగిపోయి బక్క పలుచగా మారుతున్నాయని మండల వాసులు చెబుతున్నారు. గ్రామాల్లో పడివున్న వ్యర్థ పదార్థాలను తినడం ద్వారా స్కిన్ ఎలర్జీకి కారణమై వాటి శరీరంపై బొచ్చు రాలుతూ నడవలేని నిస్సహాయ స్థితికి చేరుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. వాటికి సరైన చికిత్స అందిస్తే ఈ పరిస్థితి రాదని, గ్రామ, మండల స్థాయి అధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహి ంచాలని కోరుతున్నారు. లేదంటే ఇది మరో కొత్త వైరస్‌కు ఒక హెచ్చరికలాంటిదని అన్నారు. కుక్కలను చంపితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం గతంలో ప్రచారం చేసింది. వాటిని చంపవద్దని ప్రభుత్వం అధికారులకు సూచించడంతో వాటిపై దృష్టి పెట్టేవారు లేకపోవడంతో ప్రస్తుతం వాటి పరిస్థితి ఎలా అనే సందేహంలో గ్రామప్రజలు ఉన్నారు. గతంలో గ్రామపంచాయతీ సిబ్బంది వాటిపై చర్యలు తీసుకునేవి. ఇప్పుడు వాటిని పట్టించుకునే నాధుడే లేడు. గ్రామస్తులు వాటిపై చర్యలు తీసుకోవాలని ముందుకు వెళ్దామని చూస్తున్న ఎక్కడ కేసులు నమోదు అవుతాయోనని భయాందోళనలకు గురౌతున్నారు. కొత్త రకం వైరస్‌కు ఇది దారి చూపే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.


కుక్కకు సోకిన కొత్త రకం వ్యాధి

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
గౌతమ్ రాజ్, వెటర్నరీ డాక్టర్ (ఇంచార్జ్), ముప్కాల్
ప్రతి రోజు వాటికి తినే ఆహారం పదార్థాలలో, లేదంటే అవి రోజు వారిగా తిరిగే ఇంటి నివాసాలలో భోజనంలో (అన్నం)లో ఐవర్ మెక్టిక్ టాబ్లెట్ 50ఎంజి కలిపి పెట్టాలి. ఈ పద్ధతిని క్రమం తప్పకుండా రెండు నెలలు పాటించాలి. తద్వారా అవి పూర్తి స్థాయిలో ఆరోగ్యంగా మారి యదాస్థితికి చేరుకుంటాయి. వాటిని చూసి ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

రోబోటిక్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ఆర్మూర్
మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి సెయింట్ పాల్స్ హైస్కూల్ నందు అడ్విటెక్ రోబోటిక్స్ సంయుక్తంగా ఈనెల 24 నుండి 27 వరకు టెక్ ఎక్స్‌పో - రోబోక్వెస్ట్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ సిసిలియా పాల్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధునిక రోబోటిక్ టెక్నాలజీపై అవగాహన పెంచుతూ విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్-సాల్వింగ్, ప్రాక్టికల్ లెర్నింగ్ నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం అని అన్నారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు అందుకు అనుగుణంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ ఎక్స్‌పో ద్వారా ముఖ్యంగా టెక్ ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ రంగంలో భవిష్యత్తు నిర్మించుకునేందుకు గొప్ప అవకాశాన్ని అందించామని అన్నారు. ఈ దిశగా ముందుకు సాగుతూ జూన్ 2025 నుండి సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో 'రోబోటిక్స్' అనే ప్రత్యేక విద్యా కోర్సును ప్రవేశపెట్టనుంది. విద్యార్థులకు ఆవిష్కరణాత్మకంగా లోతైన ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని అందించేందుకు అదనపు తరగతులు నిర్వహించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమం ఆధునిక విద్యను అందించేందుకు, భవిష్యత్తు సాంకేతిక సవాళ్లకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో స్కూల్ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిట్ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించిన సీఎం

- ఎమ్మెల్యే ధన్‌పాల్ వ్యాఖ్యలకు స్పందించిన ముఖ్యమంత్రి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
తెలంగాణలో బెట్టింగ్ యాప్స్ మాఫియా విస్తృతంగా జరుగుతుందని, అనేకమంది మధ్య తరగతి యువత ఈజీమనీకి అలవాటుపడి ఈ బెట్టింగ్ ఊబిలోపడి తమ జీవితాలను నాశనం చేసుకుం టున్నారని అసెంబ్లీ సమావేశంలో ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రస్తావించారు. యువత ఈ యాప్స్ వల్ల పెద్ద మొత్తంలో డబ్బు కోల్పోయి ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఈ మధ్య ఒక మీడియా పత్రికలో ఒక మాజీ మంత్రి ప్రమేయంతో ఈయాప్స్ నిర్వాహణ జరిగిందని, వస్తున్న కథనాలపై విచారణ జరపాలని ప్రభుత్వం కేవలం కొందరు ప్రమోటర్లకు నోటీసులు పంపి కేసులు బుక్ చేసి చేతులు దులుపుకోవడానికే పరిమితం కాకుండా అసలైన దోషులను గుర్తించి ముఖ్యంగా యాప్ ఓనర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో డ్రగ్స్ కేసు నీరుకార్చినట్టు కాకుండా ఈ బెట్టింగ్ మాఫియాపై పూర్తి స్థాయి విచారణ జరపాలని దోషులు ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి బుధవారం అసెంబ్లీలో సిట్ వేసి విచారణకు ఆదేశించినట్టు తెలిపారు. బెట్టింగ్ యాప్ ల నుండి యువతను రక్షించాలని బెట్టింగ్ యాప్ ఓనర్లపై చర్యలు తీసుకోవాలన్నా డిమాండ్‌కు స్పందించి ముఖ్య మంత్రి సిట్ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించడం పట్ల ఎమ్మెల్యే ధన్ పాల్ ధన్యవాదాలు తెలిపారు.


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే

ప్యాకేజ్ 21-ఏ పనులు పూర్తి చేసి సాగునీరివ్వాలి

- శాసనసభ సమావేశాల జీరో అవర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- చిట్టాపూర్, సుర్బిర్యాల్, ఫత్తేపూర్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్యాకేజ్ 21-ఏ పనులు వేగవంతంగా పూర్తి చేసి, రైతాంగానికి సాగు నీరు ఇవ్వాలని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం శాసన సభ సమావేశాల్లో భాగంగా జీరో అవర్ లో బాల్కొండ నియోజకవర్గంలో నీటిపారుదల శాఖలో పలు సమస్యలను సభలో లేవనెత్తి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, జగిత్యాల జిల్లా మెట్ పల్లి నియోజకవర్గాల్లో సుమారు 2లక్షల12వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడానికి నిర్దేశించిన ప్రాజెక్ట్ ప్యాకేజ్ 20, 21, 21-ఏ అని గుర్తు చేశారు. రూ.4వేల 800 కోట్లతో మొదలు పెట్టి గత ప్రభుత్వ హయాంలోనే 70 శాతం పనులు పూర్తి చేసి సుమారు రూ.3వేల300 కోట్లు ఖర్చు చేశామని శాసనసభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. మిగతా పనులు కూడా తొందరగా పూర్తి చేయాలని కోరారు. ముఖ్యంగా ప్యాకేజ్ 21-ఏ బాల్కొండ నియోజవర్గంలో భీంగల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాలకు కలిపి 80 వేల ఎకరాలు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో జక్రాన్ పల్లి మండలంలో 28వేల ఎకరాలు, ఆర్మూర్ నియోజకవర్గంలో 6వేల ఎకరాలు మెట్‌పల్లి నియోజకవర్గంలో 12వేల ఎకరాలు సాగు నీరు అందించేందుకు ఆస్కారం ఉందని గుర్తు చేశారు. ప్యాకేజ్ 21-ఏ పనులు మెట్‌పల్లి నియోజకవర్గంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. హెడ్ వర్క్స్, పంప్ హౌజ్‌లు ,మెయిన్ డిస్ట్రిబ్యూటరి లైన్, మెయిన్ లైన్ పూర్తి అయ్యిందని, ఒక డిస్ట్రిబ్యూటరి లైన్ వేయాల్సి ఉందని వివరించారు. ఇది పైప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని. దీనికి నిధుల కొరత లేదని, బ్యాంక్‌తో లింక్ అయ్యి ఉందన్నారు. ప్యాకేజ్ 21-ఏ లో మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేసినట్లయితే 6 నెలల్లోనే లక్ష 20వేల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని, పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు.



చిట్టాపూర్, సుర్బిర్యాల్, ఫత్తేపూర్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి..
9,274 ఎకరాలకు సాగు నీరు అందించే చిట్టాపూర్, సుర్బిర్యాల్, ఫత్తేపూర్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుండి తీసుకోబడన మరొక లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ చిట్టాపూర్, సుర్బిర్యాల్, ఫత్తేపూర్ లిఫ్ట్ అని శాసనసభలో ఆయన ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వంలో సుమారు 9274 ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి రూ.150 కోట్లతో ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్లు తెలిపారు.
ఇందులో బాల్కొండ నియోజకవర్గంలో చిట్టాపూర్, శ్రీరాంపూర్, బాల్కొండ గ్రామాలకు రూ.60 కోట్లతో 3474 ఎకరాలు, ఆర్మూర్ నియోజకవర్గంలో ఫతేపూర్, సుర్బియాల్ గ్రామాలకు రూ.90 కోట్లతో 5800 ఎకరాలకు ఈ లిఫ్ట్ ద్వారా సాగు నీరు అందించవచ్చు అన్నారు. నెమ్మదిగా సాగుతున్న పనులను వేగవంతం చేసి, లిఫ్ట్ ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి శాసనసభ జీరో అవర్ లో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని కేశ్‌పల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు కారోబార్ గంగ సాయిలు గురువారం తెలిపారు. రానున్న వేసవి కాలంలో కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఉపాధి హామీ కూలీలకు అణువుగా ఉండే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచులు , సొసైటీ డైరెక్టర్లు రైతులు గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి

నలంద ప్రీ స్కూల్లో ఘనంగా ప్రదర్శన శాల


ప్రదర్శనలో పాల్గొన్న ప్రైమరీ విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణ పరిధిలోని మామిడిపల్లి నందు నలంద ప్రీ ప్రైమరీ స్కూల్‌లో గురువారం పిపి ఎక్స్పో (ప్రదర్శనశాల) నిర్వహించినట్టు. ప్రిన్సిపాల్ సాగర్ , కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము చదువుకొనే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు లేవని అన్నారు. మీకు ఇలాంటి అవకాశం చిన్ననాటి నుంచే నేర్చుకొంటున్నారు. పట్టణంలో పిపి ఎక్స్పో నిర్వహించడం మొదటి సారి గర్వనీయం, చిన్ననాటి నుంచే ప్రతి విషయం పట్ల పట్టు ఉండటం గర్వించదగ్గ విషయం అని తెలిపారు. పిపి విద్యార్థులు రాష్ట్రాలు - రాజధానులు, ప్రతిజ్ఞ ఆంగ్లంలో చూడకుండా చెప్పడం చూపరులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఇంజనీర్, డాక్టర్, టీచర్, లాయర్, ఫార్మర్ వేశాధారణలో ఉండి వాటిని ఆంగ్లంలో చెప్పడం, నెలల, వారాల పేర్లు కూడా ఆంగ్లంలో చెప్పారు. హెల్త్ ఫుడ్స్, సెల్ ఫోన్, టెలీవిజన్, స్మోకింగ్, రెస్పెక్టెడ్ పేరెంట్స్, టీచర్స్, గ్రాండ్ పేరెంట్స్, గూడ్ మాన్నెర్స్, సండే హెూమ్ టాస్క్, జాయింట్ ఫ్యామిలీ, ఇన్సూరెన్స్‌పైన తెలిపిన విషయాల ప్రాముఖ్యతను ఆంగ్లంలో తెలిపారు. వారి తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు అడుగగా చిన్ననాటి నుంచే ప్రతి విద్యార్థి పాల్గొని చెప్పడం చాలా సంతోషం అని తెలిపారు. మున్ముందు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రీ ప్రైమరీ టీచర్స్ అపూర్వ, అరుంధతి, సౌమ్య, జ్యోతి, నవనీత, మమత, ఉపాధ్యాయబృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫతేనగర్ రైతులకు క్రాఫ్‌లోన్లు ఇవ్వాలి

- సహకార సంఘం మహాజనసభలో తీర్మానం


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-నవీపేట్
మండలంలోని ఫతేనగర్ రైతులకు సైతం గతంలో మాదిరిగా క్రాఫ్ లోన్లు ఇవ్వాలని నవీపేట్ సహకార సంఘం పాలకవర్గం తీర్మానించింది. సొసైటీ ఆవరణలో చైర్మన్ న్యాలకంటి అబ్బన్న అధ్యక్షతన 65వ మహాజన సభ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు లక్షల రుణమాఫీ ప్రతి ఒక్క రైతుకు అందేలా చూడాలని కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని రైతులు సభ దష్టికి తీసుకువచ్చారు. రాంపూర్, ఫతేనగర్ వెళ్లే రైల్వే గేటు మరమ్మత్తుల కారణంగా ఆ గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఫతేనగర్, దర్యాపూర్ గ్రామాల్లో గోదాములను నిర్మించాలని తీర్మానించారు. ఏప్రిల్ ఒకటి 2024 నుండి సెప్టెంబర్ ఒకటి 2024 వరకు జమ ఖర్చులను సొసైటీ సీఈవో మహేష్ సభ ఐదష్టికి తీసుకురాగా ఆమోదించారు. అంతకుముందు డైరెక్టర్ బాలగంగాధర్ ఒక లారీ లోడ్ బియ్యం లెక్కలు ఏమయ్యాయని అడిగితే లెక్కలు తెలపడం లేదని నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. హాస్యాస్పదంగా జవాబు ఇవ్వడంతో రైతులు ఆగ్రహించగా మహాజన సభ గందరగోళంగా మారింది. కార్యక్రమంలో క్లస్టర్ అధికారిని రుమావతి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించిన కలెక్టర్


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లా బిసి ఉద్యోగుల సంఘం డెయిరీ 2025 తన ఛాంబర్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు విడుదల చేశారు. ఉద్యోగులు అందరూ సమిష్టి కృషి చేయాలని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సార్, రెడ్ క్రాస్ చైర్మన్ బూస ఆంజనేయులు, బిసి సంక్షేమ శాఖ అధికారి స్రవంతి, జిల్లా బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కరిపె రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్ర మోహన్, కోశాధికారి ప్రభాకర్, ఉపాధ్యక్షులు కరిపే మధుసూదన్, భూమన్న సుధాకర్, ఉత్తమ్, నరసయ్య, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

50 వేల సబ్సిడీ చెక్కు అందజేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్
మండలంలోని బెజ్జోరా గ్రామానికి చెందిన దివ్యాంగుడు కునే నరేష్‌కు 50వేల సబ్సిడీ చెక్కును ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, ఏసిడిపిఓ స్వర్ణలత, ఐసిడి ఎస్ సూపర్వైజర్ శారద చేతుల మీదుగా గురువారం అందజేశారు. రాయితీ రుణాల పథకం కింద వ్యాపారం కోసం జనరల్ స్టోర్ కోసం చెక్కును అందజేసినట్టు ఎంపీడీవో తెలిపారు.


చెక్కును అందజేస్తున్న ఎంపీడీవో

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలో ఆశాకార్యకర్తలు చేపడుతున్న ఇంటింటి సర్వే కొనసాగుతుంది. కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే ఆశా కార్యకర్తలు చేపడుతున్నారని ఎర్రపాడు వైద్యాధికారిణి అర్షుమన్ నిసార శుక్రవారం తెలిపారు. కుటుంబాల్లో ఎవరికైనా కొత్తగా శరీరంపై తెల్ల మచ్చలు ఏర్పడితే నమోదు చేస్తున్నారని అవసరమైన పరీక్షల కోసం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ సర్వే మరో వారం రోజులపాటు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, గుర్రాల సుజాత, స్వప్న, కనుకంటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సర్వే నర్వహిస్తున్న ఆశా కర్యకర్తలు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.10 లక్షలతో సిసి రోడ్డు పనులను ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల మదన్ మోహన్ రావు సహకారంతో పనులు ప్రారంభించామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులతోపాటు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, కాంగ్రెస్ నాయకులు జెసిపి శేఖర్, రావుఫ్, దండ బోయిన అంజవ్వ, చెన్నూరి స్వరూప, నామాల రవీందర్, కామారెడ్డి రవి, మేర రవి, శ్రీశైలం, గొర్రె శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

త్వరితగతిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- విండోల సమావేశంలో రైతుల డిమాండ్

నవతెలంగాణ-పిట్లం

రబీ సీజన్‌కు గానూ పండించిన జొన్నల కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని చిల్లర్గి, కారేగావ్ సింగిల్ విండో రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చిల్లర్గి, కారేగావ్ చైర్మన్లు శపథంరెడ్డి, వెంకట్‌రెడ్డి అధ్యక్షతన సింగిల్ విండోల వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు గానూ పండించిన జొన్నల కొనుగోలు నిమిత్తం గ్రామ గ్రామాన త్వరితగతిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ఎకరాకు 20 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేయాలన్నారు. గత వర్షాకాలం పండించిన సన్న రకం వడ్ల బోనస్ రూపాయలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రుణమాఫీ కానీ రైతులకు ఏకకాలంలో మాఫీ చేయాలని అన్నారు. దీర్ఘకాలిక రుణాలపై రైతులకు ఒత్తిడి లేకుండా సమయానుకూలంగా చెల్లించే విధంగా సమయం ఇవ్వాలని రైతులు కోరారు. బండపల్లి సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు వరకు మొరం చదును చేయాలని అన్నారు. సంఘంలోని కొత్త సభ్యులకు కల్పించాలని సభను కోరారు. ముందుగా విండో సీఈఓలు సంతోష్‌రెడ్డి, నరసింహారెడ్డి ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. కాగా దీర్ఘకాలిక అప్పులను మార్చ్ నెలాఖరు వరకు చెల్లించి విండోల అభివృద్ధికి కషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చిల్లర్గి విండో వైస్ చైర్మన్ డాకూరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూరత్ వంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అన్నారం వెంకటరామిరెడ్డి, జొన్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, సిబ్బంది హన్మాండ్లు, రవీందర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

నేడు వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం మహాజనసభను శుక్రవారం ఉదయం 10 గంటలకు వ్యవసాయ సహకార సంఘంలో నిర్వహించనున్నట్టు సీఈవో నర్సింలు తెలిపారు. వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు నల్లవెల్లి కపిల్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు సహకార సిబ్బంది హాజరుకావాలని కోరారు.

లింగంపేట్ : మండలంలోని నల్లమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాజనసభను ఏర్పాటు చేయనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నల్లమడుగు సొసైటీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సొసైటీ పాలకవర్గం సభ్యులు మహాజన సభకు హాజరు కావాలని సూచించారు. పాలకవర్గం సభ్యులు, సింగిల్ విండోలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతూ మహాజన సభకు హాజరు కావాలని సభలో పలు అంశాలను వివరించారు.

ఉపాధి పనులు పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బాయంపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేష్ గురువారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు చేపల చెరువు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. కూలీల సాయంతో చేపల చెరువు పనులు ప్రారంభించారు. చేపల చెరువు ఏర్పాటుతో రైతులు ఆర్థికంగా బలపడతారన్నారు. ఆయన వెంట కార్యదర్శి క్షేత్ర సహాయకులు కాళిదాస్ కూలీలు ఉన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ శ్రీనివాసరావు




మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మంజీరా వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని గోలీలింగాల్ గ్రామంలో గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అనుమతి లేనిది ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ప్రస్తుతం సిసి రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో రెవెన్యూ నుంచి అనుమతి ఇచ్చి రెవెన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది మధ్య ఇసుకను తరలించాలని అలాకాకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఆయన అన్నారు. సిసి రోడ్లకు అనుమతి ఇచ్చిన ట్రిప్పులు మాత్రమే తేవాలని అన్నారు. ట్రాక్టర్ల నంబర్లతో సహా అనుమతులు జారీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గిర్దావార్ మహమ్మద్, సీనియర్ అసిస్టెంట్ సాయిలు, మాజీ సర్పంచ్ శివకుమార్, సురేందర్‌గౌడ్ గ్రామస్తులు ఉన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



పశువులకు వైద్యం చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే పశువైద్య శిబిరాలను పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్ తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు మద్నూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు. గురువారం మద్నూర్ మండలంలోని కొడిచేర గ్రామంలో ఏఎంసీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ హన్మంతు యాదవ్, కోడిచెర గ్రామ తాజా మాజీ సర్పంచ్ సంతోష్ పటేల్, డాక్టర్ యూసఫ్, మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ పి.రమేష్, మార్కెట్ కమిటీ సూపర్వైజర్లు చందర్, సత్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కమిటీ సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్) మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని చైర్మన్ మర్రి సదాశివరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యుల ఆమోదంతో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా వరి కొనుగోలు కేంద్రాలను 50 ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం)కు కేటాయించే ప్రభుత్వ నిర్ణయాన్ని పున:పరిశీలించాలనే బలమైన డిమాండ్ వ్యక్తమైంది. ఈ నిర్ణయాన్ని పున:సమీక్షించకపోతే భవిష్యత్తులో పీఏసీఎస్ కొనసాగడం కష్టమవుతుందని తెలిపారు. ఇది రైతులకు సహకార వ్యవస్థకు తీవ్రమైన సమస్యలను కలిగించే అవకాశం ఉందని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పీఏసీఎస్ రైతులకు అందించే సేవలలో కీలక పాత్ర పోషిస్తోందని, దీని ప్రాముఖ్యత తగ్గిపోతే రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. అలాగే కుప్రియాల్‌లో కొత్త గోదామును నిర్మించడం అత్యవసరమని సమావేశంలో అభిప్రాయపడుతూ, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, పంపిణీని సజావుగా నిర్వహించేందుకు దీనిని తక్షణమే అమలు చేయాలని నిర్ణయించారు. రైతుల ప్రయోజనాలను సహకార రంగాన్ని పరిరక్షించేందుకు ఈ తీర్మానాలను సంబంధిత అధికారులకు తెలియజేసి.. అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పశుపతి, మానిటరింగ్ ఆఫీసర్ సాయిలు, సీఈవో భైరయ్య, డైరెక్టర్లు లక్ష్మాగౌడ్, బి.భాస్కర్, జి.నారాయణరెడ్డి, ఉమామహేశ్వర్‌రావు, నర్సవ్వ, గంగామణి, బట్టుల రాములు, ప్రవీణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజేందర్‌రెడ్డి సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

మహిళా రైతులకు వ్యవసాయ యంత్ర పనిముట్లు

- వర్ని, చందూర్, మోస్రా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-వర్ని

రాష్ట్ర ప్రభుత్వం మహిళా రైతులు వ్యవసాయంలో మరింత ముందుకు వెళ్లేలా వ్యవసాయ యంత్రీకరణ భాగంలో ఆర్థిక సంవత్సరం 24-2025లో మహిళా రైతులకు వ్యవసాయ యంత్రీకరణపై ఉప-మిషన్ (ఎస్ఎంఏఎం) పథకంలో 50శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లకు ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించినట్లు వర్ని, చందూర్, మోస్రా మండలాల వ్యవసాయ విస్తీరణ అధికారి ఎం.రాజశేఖర్ తెలిపారు. ఈ పనిముట్లకు మహిళా రైతులు తమ పేరుపై పొలం పట్టాదారులై ఉండాలని పేర్కొన్నారు. పనిముట్లు, బ్యాటరీ మ్యానివల్ స్ప్రేయర్లు 05, బ్యాటరీ పవర్ స్ప్రేయర్ 05, రోటో మీటర్లు 03, ట్రాక్టర్ పనిముట్లు కల్టివేటర్లు, ఎంబీ ప్లేవ్, కేజీవీల్స్ 04, సీడ్‌కమ్ ఫెర్టీలైజర్ డ్రిల్ 01 మహిళా రైతులకు రాయితీపై ఇవ్వబడుతాయని పేర్కొన్నారు. కావాల్సిన మహిళా రైతులు భూమి పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సిటో పాటు ట్రాక్టర్ పనిముట్లు వివరాలు ఈ నెల 29న లోపు గ్రామ వ్యవసాయ, మండల వ్యవసాయ అధికారులకు అందజేయాలని, మహిళా రైతులు ఈ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులోని ఖరగ్ గ్రామంలో రూ.10లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణం పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తమ గ్రామం చిన్నదైనప్పటికీ జుక్కల్ ఎమ్మెల్యే గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, సీనియర్ నాయకులు హనుమాన్లు, స్వామి విఠల్ గురూజీ, సలాబత్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్ కొండ గంగాధర్, నాయకులు, ఖరగ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

వన్ నేషన్ వన్ ఎలక్షన్ వర్క్‌షాప్

నవతెలంగాణ-సదాశివనగర్/లింగంపేట్

మండల శాఖ ఆధ్వర్యంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ వర్క్‌షాప్ కార్యక్రమానికి సంబంధించి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగరావు, జిల్లా ఉపాధ్యక్షులు విఠల్ వచ్చారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు కుంట రాంరెడ్డి, ఉపాధ్యక్షులు చక్రధర్‌గౌడ్, జిల్లా నాయకులు పాలబోయిన సాయిలు, హారిక, మండల నాయకులు మహిపాల్ యాదవ్, కటికే రమేష్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సదాశివనగర్: మాట్లాడుతున్న నాయకలు

లింగంపేట్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యం బలపడుతుందని బీజేపీ లింగంపేట్ సీనియర్ నాయకులు రాజారాం నాగరాజ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే ఎన్నికపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని పేర్కొన్నారు.

టిజిఆర్‌జేసీ సెట్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మద్నూర్/ఎడపల్లి

టీజీఆర్‌జేసీ సెట్ 2025 ప్రవేశాల కోసం పదవతరగతి బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చని మద్నూర్ గురుకుల బాలుర విద్యాలయం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నందాల గంగాకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు గానూ ప్రవేశ అర్హత పరీక్ష కోసం ఆసక్తి గల 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బాలికలు, బాలురు కలిపి 35 తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. ఇందుకోసం tgrjc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. రూ.200 దరఖాస్తు రుసుముతో 24 మార్చి 2025 నుంచి 23 ఏప్రిల్ 2025 వరకు ఈ అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రవేశ పరీక్షా ప్రతిభా, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ నేతత్వంలో ప్రవేశపరీక్ష మే 10, 2025 శనివారం ఉంటుందని పేర్కొన్నారు. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని కోరారు. వివరాలకు నెంబర్లను 040-24734899 సంప్రదించవచ్చునని తెలియజేశారు.

ఎడపల్లి : 2025-2026 విద్యా సంవత్సరానికి గానూ ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న బాలబాలికలు టీజీఎస్ ఆర్‌జెసి 2025 సెట్ ఇంటర్ మొదటి విద్యా సంవత్సరం కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎడపల్లి మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాల ప్రధానాచార్యులు గంగాశంకర్ బాలబాలికలను కోరారు. తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 2025-26 విద్య సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం కోసం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని, బాలికలకు, బాలురకు పోచంపాడ్, బోధన్, మద్నూర్, పోచంపాడ్, జూనియర్ కళాశాలలో ప్రవేశ పొందే అవకాశం ఉందన్నారు. ఈనెల 24 నుంచి ఏప్రిల్ 23వ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రవేశపరీక్ష 10/05/2025 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు కొనసాగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులుగా బుర్ర రామకష్ణ గౌడ్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ యూత్ మండలాధ్యక్షునిగా బుర్ర రామకష్ణ గౌడ్‌ను ఎన్నుకున్నారు. గురువారం ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు సర్దార్ నాయక్ అధ్యక్షతన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. నూతన యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా నాకు బాధ్యతలు ఇచ్చినందుకు ఎల్లారెడ్డి నియోజకవర్గం శాసనసభ్యులు మదన్ మోహన్ రావుకు, జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీని, యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తానని, స్థానిక ఎన్నికల్లో కూడా ప్రతి గ్రామంలో కమిటీలు వేసి అందరినీ ప్రోత్సహించే విధంగా పనిచేస్తానని, పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆయన భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సన్మానించిన పలువురు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని బట్టు తాండ, కన్నాపూర్‌లో నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నారెడ్డి మోహన్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బాలరాజవ్వ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలుసుకుని ఆర్థిక సహాయాన్ని, బట్టు తాండాకు చెందిన గంగావత్ శివ అనారోగ్యంతో మతి చెందగా బాధిత కుటుంబానికి రూ.2000, 50కేజీల బియ్యాన్ని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటస్వామి, రెడ్డి నాయక్, మాజీ ఉపసర్పంచ్ లచ్చిరాం నాయక్, శంకర్ నాయక్, రామచంద్రనాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపుల వేలం



వేలం పాటలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో పట్టుబడ్డ ఇసుకను గురువారం వేలం ద్వారా విక్రయించినట్టు మండల రెవెన్యూ అధికారి భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం మూడు ట్రాక్టర్ల ఇసుకను వేలం వేసినట్టు పేర్కొన్నారు. మూడు ట్రక్టర్ల ఇసుక ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.3100కు గానూ వేలంలో రూ.5100కు అచ్చంపేట్ గ్రామస్తులు సొంతం చేసుకున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాటు పూర్తి



పూజలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 29న శనివారం అమావాస్య పవిత్ర రోజు శుభ సందర్భంగా భక్తుల సౌకర్యం మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ఈవో గుంజుపల్లి వేణు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రఘుతోపాటు ఆలయ కమిటీ వేద పండితులు తదితరులున్నారు.

మొండిసడక్ నర్సాపూర్ తైబజార్ వేలంపాట

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని మొండిసడక్ నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల తైబజార్ వేలంపాటను గురువారం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి గానూ తైబజార్ వేలం నిర్వహించినట్లు పేర్కొన్నారు. తైబజార్ వేలం నిర్వహించగా.. రూ.82,000 మెగావత్ పండిత్ దక్కించుకున్నారని పంచాయతీ కార్యదర్శి నగ్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

టైలరింగ్‌పై శిక్షణ



టైలరింగ్ శిక్షణలో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలో సమాఖ్య కార్యాలయంలో టైలరింగ్ స్టిచ్చింగ్, కటింగ్‌పైన సభ్యులకు శిక్షణనిచ్చారు. రాజంపేట సంఘం సభ్యులు పద్మ, విజయలక్ష్మి శిక్షణనిచ్చినట్టు పేర్కొన్నారు. ఏప్రిల్‌లో స్కూల్ పిల్లల యూనిఫామ్ స్టిచ్చింగ్‌పై వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీ శ్రీనివాస్, ఎమ్మెస్ అధ్యక్షులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధికి రూ.70 కోట్లు మంజూరు చేయించి ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావుకు ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌పటేల్, మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు, ఘనంగా సన్మానించారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ధరాస్ సాయిలు, డోంగ్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాజు పటేల్, నాయకులు వెళ్లారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్
శుక్రవారం | మార్చి 28, 2025 | www.navatelangana.com

రంజాన్ గ్రాంట్ విడుదల


గ్రాంట్‌ను విడుదల చేస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-ముప్కాల్
రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన గ్రాంట్‌ను గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ముప్కాల్ మైనార్టీ సోదరులకు విడుదలైన గ్రాంట్ చెక్కును తహశీల్దార్ గజనాన్ అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు రాష్ట్ర ప్రభుత్వంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు అబ్దుల్ రవుఫ్, రఫియోద్దిన్, నశిరోద్దిన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాజిత్, అబ్రార్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి ఇబ్బందులు ఉన్న పరిష్కరిస్తాం

- ఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఎలాంటి ఇబ్బందులు ఉన్న పరిష్కరిస్తమని ఎఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. గురువారం గాంధీ గంజ్‌లో కూరగాయల మార్కెట్, అనంతరం డ్రైనేజీ పనుల మరమ్మతుల పనులను ఆయన పరిశీలించారు. అక్కడున్న సమస్యలను కూరగాయల వ్యాపారస్తులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే, పరిష్కరిస్తమని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మఒడి


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ వీణ మాట్లాడుతూ.. ప్రతి గురువారం అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి గర్భిణీస్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలపడం, అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ వేణు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు కార్యకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ నేర్పే ఆచార్యుడు 'కాలం'


మాట్లాడుతున్న ఘనపురం దేవేందర్

నవతెలంగాణ-కంఠేశ్వర్
కాలం ఎప్పటికీ క్రమశిక్షణ తప్పదని, వసంతాన్ని మోసుకు వచ్చే ఉగాది అందుకు నిదర్శనమని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనపురం దేవేందర్ అన్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్ కొండాపూర్ రామాలయంలో జరిగిన విశ్వావసు ఉగాది వేడుకలలో ఆయన పాల్గొన్నారు. క్రమశిక్షణ నిరాడంబరత సమాజాన్ని ప్రశాంతత వైపు నడిపిస్తాయని, ప్రశాంతంగా ఉండడం, సమాజంలో ప్రశాంతతకి కారణం కావడం గొప్ప సంస్కృతని ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో ఆయన కాలజ్ఞానం అనే కవితను వినిపించారు. ఈ వేడుకలలో ప్రముఖ సినీ రచయిత ఆకెళ్ల శివప్రసాద్, సంస్కార భారతి అధ్యక్ష కార్యదర్శులు వేమూరి శ్రీధర్ చాణుక్య, బెజుగం శ్రీనివాస్, ప్రతినిధులు నిరంజన్‌లు ఈ సందర్భంగా ఘనపురం దేవేందర్‌ను సత్కరించారు. సాహితీవేత్తలు డాక్టర్ వేముల సత్యనారాయణ, గుత్తి వెంకట లక్ష్మి, లక్ష్మీ శాండిల్య, వేమూరి అనంత రామకృష్ణ శర్మ, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్


సీఎం, టీపీసీసీ అధ్యక్షులను కలిసిన గడుగు గంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్
మహిళా సాధికారితకు కృషి చేయాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ అన్నారు. గురువారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డిలను తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, మరకంటి భవన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గడుగు గంగాధర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కౌన్సిల్లో మహిళా సాధికారతపై చర్చించడం అభినందనీయమన్నారు. మహిళా సాధికారతకు అందరం కృషి చేస్తే సమాజంలో మార్పులు వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపినట్టు పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- సిసి కెమెరాలను ప్రారంభించిన ఎస్ఐ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై

నవతెలంగాణ-భీంగల్‌రూరల్
మండలంలోని ముచ్కూర్ గ్రామంలోని కార్నర్ల వద్ద ఏర్పాటుచేసిన 16 సీసీ కెమెరాలను ఎస్ఐ మహేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా పది మందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలకు పాల్పడే వారిని తక్షణమే గుర్తించి శిక్ష పడేలా చేయవచ్చని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి లీకేజీ సరిచేయరా..?

- నీటి లీకేజీతో ప్రయాణికులకు ఇబ్బంది

నవతెలంగాణ-ముప్కాల్
మండల కేంద్రంలో పాత జాతీయ రహదారిపై గతంలో రోడ్డు చిన్నదిగా ఉన్నప్పుడు రోడ్డుకు ఇరువైపులా మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ, మరోవైపు ప్రతి ఇంటికి నీరు అందించేలా స్థానిక అధికారులు పెద్ద పెద్ద పైపులను ఉపయోగించి ప్రతి ఇంటికి ఉదయం, సాయంత్రం రెండు పూటలా మంచినీరును సరఫరా చేసేవారు. తదనంతరం నూతన జాతీయ రహదారి-44 నిర్మించే సమయాన బాల్కొండ నుంచి ముప్కాల్‌కు బైపాస్ రోడ్డును వేశారు. పెద్దపెద్ద వాహ నాలు బైపాస్ రోడ్డు మీద నుంచి వెళ్తున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం మండల కేంద్రంలో ఉన్న నాటి పాత జాతీయ రహదారి-7 మధ్యలో గత ప్రజాప్రతినిధుల చొరవతో రోడ్డును రోడ్డు వెడల్పు చేశారు. రోడ్డు చిన్నదిగా ఉన్నప్పుడు అట్టి నీటి సరఫరా పైపు లైన్‌పై దృష్టి పెట్టి ఉంటే ప్రస్తుతం ఈ లీకేజీలు ఏర్పడేవి కావని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం నీటి సరఫరా సమయంలో లీకేజీ నీరు రోడ్డుపై పారుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. నీటి సరఫరా అధికారులు, రోడ్డు భద్రత అధికారులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని తొందరగా రోడ్డుపై ఏర్పడ్డ నీటి లీకేజీ సమస్య పరిష్కరించాలని కోరుతు న్నారు. గత కొంతకాలంగా ఈ సమస్య పరిష్కారం కోసం అధికారులకు గ్రామస్తులు విన్నవించినా అధికారులు, ఆర్అండ్‌బి అధికారులకు సంబంధించిన పని అని, మరొక అధికారి ఇది మిషన్ భగీరథ పైపు లైన్ అని, మరొకరు ఇది స్థానిక గ్రామపంచాయతీకి సంబంధించినది అంటూ కాలయాపన చేస్తూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి పనిని పూర్తి చేయాలని గ్రామస్తులు పైఅధికారులను కోరుతున్నారు.


రోడ్డుపై చేరిన లీకేజీ నీరు

అర్గుల్‌లో ఇఫ్తార్ విందు

- పాల్గొన్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండలంలోని అర్గుల్ గ్రామంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ పాల్గొన్నారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో సర్పంచ్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేందర్ తన ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్గుల్ నరసయ్య, మాజీ వైస్ ఎంపి పి జితేందర్, వినోద్, కొలి ప్యాక్ మాజీ ఎంపీటీసీ రమేష్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్ అక్బర్ ఖాన్‌కు సన్మానం
డిచ్‌పల్లి మండల కేంద్రంలో జిల్లా మాజీ ఆర్థిక ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో జక్రాన్‌పల్లి మండల మాజీ కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్ జగన్‌ను శాలువాతో సన్మానించారు. మాజీ ఆర్టీసీ చైర్మన్, మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జక్రాన్ పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న మాజీ ఎంపీపీ డీకొండ హరిత శ్రీను, జక్రాన్ పల్లి మండల మాజీ కోఆప్షన్ బుల్లెట్ అక్బర్ ఖాన్, మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న చైర్మన్

జీపీ, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విలీన సభ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దాసు జెండాను ఆవిష్కరించారు. గురువారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘనపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి విలీన సభకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దాసు, శివ బాబు అధ్యక్షత నిర్వహించారు. ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... కార్మికులు సమ్మె చేస్తే, కేసిఆర్ నమ్మించి మోసం చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కార్మికులను పర్మినెంట్ చేసి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులకు మరణ శాసనం విధిస్తోందని శ్రీనివాస్ అన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత్‌లో అగ్ర భాగాన ఉండి పని చేస్తున్న సఫాయి కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధిని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. 2016 అక్టోబర్ 26న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం జాతీయత పేరు చెప్పి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మి వేసి కార్మికులను ఆకలితో చంపడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన అన్నారు. దేశంలో సుమారు 50కోట్ల మంది కార్మికులు ఉండగా కేవలం ఐదు కోట్ల మందికి మాత్రమే సామాజిక చట్టాలు అమలవుతున్నాయని, మిగిలిన కార్మికులందరూ అవస్థపడుతున్నారని ఆయన అన్నారు. ప్రావిడెంట్ ఫండ్ ఈఎస్ఐ చట్టాలు జిపి మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్మికులు ఐక్యంగా పోరాడి సమస్యల్ని పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ, దేశానికి అన్నదాత రైతు, సంపద సృష్టికర్తలు కార్మికులు అని అన్నారు. మోడీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తోందనీ ఆయన అన్నారు. నిరుద్యోగం, ఆకలి, పేదరికం, అసమానతలు ప్రజల్ని వేధిస్తున్నాయని ఆయన అన్నారు. సభలో ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యాదయ్య, శివబాబు, ఐఎఫ్టియు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బి.భూమన్న, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి శ్యామసన్, గుగ్గిళ్ళవెంకన్న, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయినాథ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. సభలో యూనియన్ నాయకులు అబ్దుల్, సొప్పరిగంగాధర్,కార్తీక్, నర్సిరెడ్డి, సామెల్, దాల్మల్కి పోశెట్టి,లతో పాటు ప్రజా సంఘాల నాయకులు సాయిరెడ్డి, శివకుమార్, మోపాల్ నరసయ్య, రంజిత్,తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు నాయకులు

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్
రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గురువారం అసెంబ్లీలో అన్నారు. ఉగాది నుండి రేషన్‌షాపుల్లో సన్నబియ్యం ఇవ్వనున్నందున వాటిని అక్రమంగా మహారాష్ట్రకి ఎగుమతి కాకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానివని అన్నారు. రేషన్ బియ్యం నిజామాబాద్ నుంచి అక్రమంగా సప్లై చేస్తున్నారని తెలిపారు. గతంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కూడా రేషన్ బియ్యాన్ని అమ్ముకున్నారని, ఇలా రేషన్ బియ్యం పేదవాడికి తక్కువగా అక్రమ దారులకు ఎక్కువగా ఉపయోగపడుతుందని, దీన్ని నివారించాలని అన్నారు. దీని ద్వారా కూడా ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తుందని తెలిపారు. దీనిపై సీనియర్ మంత్రులతో కమిటీ వేసి అక్రమ బియ్యానికి అడ్డుకట్ట వేయాలని అన్నారు. రేషన్ కార్డులు కూడా అర్హులకు మాత్రమే ఇవ్వాలని, అనర్హులకు తక్షణమే తీసివేయాలని ఎమ్మెల్యే అన్నారు.

29న ద్విచక్ర వాహనాల వేలం

నవతెలంగాణ-భీంగల్ రూరల్
నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నిజామాబాద్ ఆదేశాల ప్రకారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ భీంగల్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు (2) ద్విచక్ర వాహనాలను ఈ నెల 29 వేలంపాట వెయ్యనున్నట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ వేణుమాధవ్ రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం భీంగల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చని స్టేషన్ హౌస్ ఆఫీసర్ వేణుమాధవ్ రావ్ తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు బట్టాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు, విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి... ప్రభుత్వ పాఠశాల విద్య పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తడపాకల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని,ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు.ఇవే కాక ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తుందని,ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఇంగ్లీష్ మీడియం బోధన ఉంటుందని అన్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, నవీన్, భూపతి పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లింపు తేదీ పొడిగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని 2020-24 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు బిఏ, బీకాం, బిఎస్సి., బిబిఏ కోర్సుల రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్(రెగ్యులర్) ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షల కోసం ఏప్రిల్ మే, 2025లో హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించుటకు ఈనెల 26తో ముగిసింది. కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల కోరిక మేరకు ఫీజు చెల్లించు చివరి తేదీని వచ్చేనెల 07 వరకు 100 రూపాయల అపరాధ రుసుంతో తేదీ ఏప్రిల్ 08వరకు పొడగించారని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ కే.సంపత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని వివరించారు.

విద్యార్థుల సామర్థ్యాలు, నైపుణ్యాలు మెరుగుపరిచేందుకే ఏఐ

- ఎంఈఓ బట్టు రాజేశ్వర్


ఏఐ విద్యను పరిశీలిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-బాల్కొండ
ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల భాషా సామర్థ్యాలను, గణిత నైపుణ్యాలు మెరుగుపరిచేందుకే ఏఐ తరగతులు ఉపయోగపడతాయని ఎంఈఓ బట్టు రాజేశ్వర్ అన్నారు. కిసాన్‌నగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. 3వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కృత్రిమ మేధ ఆధారిత బోధన విధానం (ఏఐ) ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యముల స్థాయిని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తిమృతి



నవతెలంగాణ-బాల్కొండ
రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి బస్సాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా ముప్కాల్ వైపు నుంచి బాల్కొండ వైపు వస్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వ్యక్తి గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే 8712659860 బాల్కొండ ఎస్ఐ కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పడగల్ గ్రామ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్
పడగల్ గ్రామ జాతీయ రహదారి 63 వద్ద మహారాష్ట్ర కు చెందిన ద్విచక్ర వాహన దారులు నగేష్ , ఆనంద్ అను ఇద్దరు వ్యక్తులు గ్రామం ఎంట్రెన్స్ వద్ద హనుమాన్ నగర్ గ్రామం వైపు వస్తుండగా ఆర్మూర్ నుండి మోర్తాడ్ వైపు వెళ్తున్న ఐచర్ డీసీఎం వాహనదారులను ఢీకొనగా ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయినట్టు ఎస్సై సంజీవ్ గురువారం తెలిపారు. వెంటనే 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడం జరిగింది అని అన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య రిబ్బన్ కట్ చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో బస్టాండులో ప్రయాణికుల దాహం తీర్చేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గంగా జమున, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారి నూకల బుచ్చి మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా ఎస్.మధుసూదన్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా ఎస్.మధుసూదన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఓ)గా ఎన్.సరస్వతి బదిలీపై రంగారెడ్డి రీజియన్, డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఎం) వి.శంకర్ బదిలీపై హైదరాబాద్ రీజియన్ వెళ్లగా వారి స్థానంలో నూతన డిప్యూటీ రీజినల్ మేనేజర్, ఎస్.మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్
నియోజక వర్గంలోని నంది పేట మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కృషితో ఐదు లక్షలతో సీసీ రోడ్ పనులు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు మంగ్లరపు నవీన్ రాజు, సాయన్న, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సీపీని కలిసిన ఫారెస్ట్ అధికారి

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యని నిజామాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారి వికాస్ మీనా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం గురువారం అందజేశారు.



తాజా మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు తాజా మాజీ సర్పంచ్ లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. తాజా మాజీ సర్పంచ్‌లు గడ్డం స్వామి, ఏనుగు రాజేశ్వర్, ఇంద్రాల రాజేందర్, పాలెపు రవి కిరణ్, తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం నిర్వహించ తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా వీరిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు వీరిని అరెస్ట్ చేసిన పోలీసులు మధ్యాహ్నం తర్వాత విడిచిపెట్టారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో తాము పనులు చేసి సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వం తమ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం తమ పెండింగ్ విలువగాలను చెల్లించి తనకు న్యాయం చేయాలని కోరారు

నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉంచాలి

- **నకిలీ విత్తనాలతో రైతులకు మోసాలు జరగొద్దు : ఏవో రాజు**

నవతెలంగాణ-మద్నూర్

నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉంచాలని నకిలీ విత్తనాలతో రైతులకు ఎలాంటి మోసాలు జరగకూడదని మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు విత్తన డీలర్లకు సూచించారు. గురువారం మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మద్నూర్, బిచ్కుంద మండల విత్తన డీలర్లకు రాబోయే వానాకాలానికి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని అవగాహన సదస్సులో సూచించారు. ముఖ్యంగా డీలర్లు ఏ విత్తనాలు ఏ కంపెనీ నుంచి తెచ్చారో అమ్మకాల వివరాలు ఫారం డీలో ఆన్‌లైన్‌లో ప్రతి నెల 5వ తేదీ లోపల నమోదు చేయాలని సూచించారు. అలాగే స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్, స్టాక్ బోర్డ్, లైసెన్స్ ఉంచుకోవాలని తెలిపారు. ఈ అవగాహనా సదస్సులో మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్, విత్తన డీలర్లు, వ్యవసాయ అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డోంగ్లి మండల ఏవో శివకుమార్, ఏఈవో సౌమ్య, అనిల్, విశాల్‌గౌడ్, మద్నూర్, బిచ్కుంద మండల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

సెర్ప్ లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు

- **రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్**
- **పెండింగ్ కమీషన్ బకాయిలు ఐకెపి సంఘాలకు చెల్లించేలా చర్యలు**
- **కుట్టు కేంద్రాల ద్వారా ప్రైవేటు ఆర్డర్లు సైతం చేపట్టాలి**
- **నవంబర్ వరకు జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలి**
- **సెర్ప్ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన పంచాయతీరాజ్ కార్యదర్శి**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

సెర్ప్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ సూచించారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, సెర్ప్ కార్యక్రమాల అమలు తీరుపై సీఈఓ డి. దివ్య దేవరాజన్ తో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ, యాసంగి మార్కెటింగ్ సీజన్లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు.

జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు నిర్వహణ జరపని పక్షంలో, ఆ కేంద్రాలను ఐకేపి మహిళా సంఘాలకు బదిలీ చేయాలని, అదనపు వరి ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుని, వాటిని స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమీషన్ మహిళా సంఘాలకు అందడం లేదని, దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమీషన్ చెల్లింపులు జరిగేలా చూడాలని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలని, పౌర సరఫరాల శాఖ, సెర్ప్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు.

దివ్యాంగులకు యూ.డి.ఐ.డి. కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు.

నిర్ధారణ క్యాంపుల నిర్వహణ కోసం ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు అవసరమైన నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.

కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వృద్ధులు ఎవరైనా మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని తెలిపారు. డిఆర్డిఓ, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించి ఇటువంటి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ లకు సూచించారు.

మూడు నెలలు ఫించన్ తీసుకోని లబ్దిదారులు వలస వెళ్లినట్లు సిస్టమ్ నమోదు చేస్తుందని అన్నారు. వలస వెళ్లినట్లు నమోదు అయిన వివరాలను అధికారులు పరిశీలన చేసుకొని పెన్షన్ తీసుకోక పోవడానికి గల కారణాలు తెలుసుకోవాలని, లబ్ధిదారులు మరణిస్తే వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు.

ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి, స్కూల్ యూనిఫాం కుట్టు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టు పనులకు సంబంధించి అవసరమైన కటింగ్ మిషన్, ఇతర పరికరాలు సిద్ధం చేసుకోవాలని, మహిళా సంఘాల ద్వారా కుట్టు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని, జూన్ నెల వరకు ఈ పనులు పూర్తి కావాలని అన్నారు.

స్కూల్ యూనిఫామ్ కుట్టు పనులకు సంబంధించి కూలీ చార్జెస్ 50 రూపాయలు మాత్రమే వచ్చినట్లు మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారని, దీనిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పరిశీలన చేసి పెండింగ్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు సమర్పించేలా చూడాలని, ప్రభుత్వానికి సమర్పించిన ప్రతి బిల్లు చెల్లింపు పూర్తవుతుందని అన్నారు.

స్వశక్తి మహిళ సంఘాల ద్వారా నెలకొల్పబడిన స్టిచ్చింగ్ సెంటర్ లు పూర్తి స్థాయిలో వినియోగించేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు యూనిఫామ్ కుట్టిన తర్వాత ప్రైవేట్ గా కూడా కుట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందుగా జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల స్థాయిలలో కూడా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కార్యాచరణ ఉంటుందని ఆయన అధికారులకు తెలిపారు.

మహిళలచే చేపట్టే పెట్రోల్ బంక్ లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న హెూటల్ వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉండాలని అన్నారు. మహిళా శక్తి మాల్స్ ఏర్పాటుకు కూడా అవకాశాలు కల్పించాలని అన్నారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి బజార్ కింద షాప్స్ ఏర్పాటుకు ప్రతి జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ లలో ప్రజలకు అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉండాలని అన్నారు.

జిల్లాలలో వివిధ సమయాలలో నిర్వహించిన తనిఖీలలో అవకతవకలు గమనించి లైసెన్స్ రద్దు చేసిన పెట్రోల్ బంక్ లను మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రమాద బీమా, సాధారణ బీమా పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని, మరణించిన మహిళా సంఘాల సభ్యుల సరైన డాక్యుమెంట్ లను పరిశీలించి సరైన లబ్దిదారులకు ఈ సహాయం అందేలా చూడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి జిల్లాలో ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు మరణించారు, వారిలో ఎంత మందికి ప్రమాద బీమా, సాధారణ బీమా అమలు అవుతుంది పరిశీలించి సంబంధిత లబ్ధిదారులకు సహాయం అందజేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్, ఎల్డీఎం అశోక్ చౌహాన్, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, మెప్మా పిడి రాజేందర్, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-ఏర్గట్ల

అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, ఒక జేసీబీని గురువారం బట్టాపూర్ శివారులో పట్టుకుని కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఏఎస్సై లక్ష్మణ్ నాయక్ తెలిపారు. మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఉర్దూమీడియం పాఠశాల తనిఖీ చేసిన బోధన్ సబ్ కలెక్టర్



నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలోని ఉర్దూ మీడియం పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన పద్ధతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉపాధ్యాయులను తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆయన ఆ సూచించారు. అనంతరం తెలుగు మీడియం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో బోధనపై మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు రఫిక్ తాహెర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికపై సమావేశాలు

నవతెలంగాణ-భిక్కనూర్/మద్నూర్/తాడ్వాయి

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామ వృద్ధుల కమ్యూనిటీ భవనంలో మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ అధ్యక్షతన ఒకే దేశం ఒకే ఎన్నిక అంశంపై సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త గా విచ్చేసిన బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ విపుల్ జైన్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర పార్టీ ఆదేశాల సూచన మేరకు వన్ నేషన్ వన్ ఎలక్షన్ పేరిట సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు తేప్పవార్ తుకరం, ముఖ్య అతిథిగా మండల ఇంచార్జ్ మల్లికార్జున దేశాయ్, మాజీ సొసైటీ చైర్మన్ పండితరావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : ఒకే దేశం ఒకే ఎన్నికపై మండల కేంద్రమైన బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబిసి జిల్లా మోర్చా మాజీ అధ్యక్షులు మహారాజుల మురళి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్రావు, హెూటల్ శ్రీను, ఉపాధ్యక్షులు నర్సారెడ్డి, రమేష్, ఓబిసి మోర్చా నాయకులు బుధం దత్తాత్రేయ, ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణ నాయి బ్రాహ్మణ నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గౌరవ అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షులుగా మంగళూరు సాయికుమార్, ఉపాధ్యక్షులుగా జొన్నల వేణు, క్యాషియర్ కడెం దేవరాజు, కార్యదర్శి దుబ్బాక మురళి, సంయుక్త కార్యదర్శి నవీన్, ముఖ్య సలహాదారులుగా మంగళారపు సుదర్శన్, జనపాల రామసామి, తదితరులను ఎన్నుకున్నామని పేర్కొన్నారు.

బీసీల హక్కుల సాధనకు చలో ఢిల్లీ

చలో ఢిల్లీ కరపత్రాలు ఆవిష్కరణ



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిజామాబాద్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బీసీల హక్కుల సాధనకు బీసీల పోరు గర్జనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునివ్వడంతో మేమెంతో మాకు అంత వాటా అనే నినాదంతో ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీల పోరు గర్జన పోస్టర్లు గురువారం ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా కులగనన చేపట్టాలని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 42 శాతం కు పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ పార్లమెంటు సమావేశాలలోని ప్రవేశపెట్టి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా నుండి పెద్ద ఎత్తున బీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తో పాటు బుస ఆంజనేయులు పోల్కం గంగాకిషన్, కరిపె రవీందర్ దర్శనం దేవేందర్, కొయ్యడ శంకర్, శ్రీలత, చంద్రమోహన్ చంద్రకాంత్ దారం భూమన్న బాలన్న అజయ్ వాసం జయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం 90వ మహాజన సభ

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం 90వ మహాజన సభను గురువారం నిర్వహించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు ఎమ్‌డీ రియాజుద్దీన్, వెంకటేశ్వర్‌రావు, ఇన్‌ఛార్జ్ కార్యదర్శి శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాజన సభలో సభ్యులడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోవడంతో, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇంటర్నల్ ఆడిట్ చేయాలని కోరారు. గతకొన్నేండ్లుగా సంఘం అస్తవ్యస్తంగా కొనసాగు తుందని, లావాదేవీల పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేశారు. సహకార సంఘం పరిరక్షణ కోసం సభ్యులందరూ ఏకగ్రీవంగా 9 మంది సభ్యులను శంకర్, ఎస్.రమేష్, వెంకటేశ్వరరావు, గోపాల్‌రెడ్డి, దిలీప్‌కుమార్, పవన్ కుమార్, గంగాధర్, మురళీధర్, డా.లక్ష్మణ్‌కుమార్ వీరితోపాతు మదన్ మోహన్‌ను ఇంటర్నల్ ఆడిట్ కోసం నియమించారు. సమస్యలపై చర్చించి నిర్ణయాలు తిసుకోవాలని, కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించి, ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. నష్టపరచినవారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ కష్టపడి పనిచెయ్యాలన్నారు. సంఘం నష్టాలలో నడుస్తోందని అందువల్ల బోనస్, ఓవర్ టైం, ఇతర భత్యాలు ఇవ్వవద్దని తెలిపారు. పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలన్నారు. నేలకొకసారి సమావేశమై సంఘం వ్యాపారాలపై చర్చించి, లెక్కలు చూడాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ రేకుల షెడ్, టాయిలెట్ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. అందరూ కలిసి, కష్టాల నుంచి గట్టెక్కించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.



మహాజన సభలో పాల్గొన్న రైతులు

దాడిలో గాయపడి యువకుడు మృతి

నవతెలంగాణ-దోమకొండ

దాడి చేసిన ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై స్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేట గ్రామానికి చెందిన ఈరబోయిన రమేష్ (35) గత నాలుగు నెలల క్రితం తన కారును చింతమనుపల్లి గ్రామానికి చెందిన పల్లె పోచయ్యకు విక్రయించాడు. కారు విక్రయించిన ఒప్పందం ప్రకారం సగం డబ్బులు చెల్లించలేదు. గత కొన్ని రోజుల నుంచి డబ్బులు అడిగినా ఇవ్వకపోవడంతో గురువారం ఉదయం చింతమనుపల్లి గ్రామంలో ఇంటి వద్ద తన కారు డబ్బులు ఇవ్వాలని అడగగా పల్లె పోచయ్య కొంతమంది కలిసి ఈరబోయిన రమేష్‌పై కర్రలతో దాడి చేయడంతో బలమైన గాయాలు కావడంతో పడిపోయాడు. గ్రామస్తులు కుటుంబీకులకు సమాచారం తెలియడంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడు. మృతుని భార్య ఈరబోయిన అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు చిన్నారులున్నారు.

ఆలయాలు, ప్రాజెక్టులను సందర్శించిన విద్యార్థులు

- **ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్**
- **ఇండియాలో భాగంగా విద్యార్థుల పర్యటన**

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎంశ్రీ)చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం జిల్లాలో ఉన్న ఆలయాలను, వనాలను, ప్రాజెక్టులను సందర్శించారు. ఇందులో భాగంగా ఏడుపాయల వనదుర్గ ఆలయం, మెదక్ చర్చి, వెస్లీ కాలేజ్, పోచారం అభయారణ్యాలు, నిజాంసాగర్ చేపల కేంద్రం, ప్రాజెక్టులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల వన దుర్గాదేవి ఆలయ విశిష్టతను, చర్చి చరిత్రను విద్యార్థులు తెలుసుకున్నారు. దీని నిర్మాణం 1914-24 వరకు జరిగినట్లుగా పాస్టర్ తెలిపారు. అనంతరం పోచారం అభయారణ్యంలోని వన్యప్రాణులను, అడవుల పెంపకం అవసరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం 1923-31లో జరిగినట్లుగా ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నారు. ప్రాజెక్టును, వన విజ్ఞాన కేంద్రం ప్రత్యక్షంగా తిలకించడం తమకెంతో ఆనందాన్నిచ్చిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే.సాయిరెడ్డి, పాఠశాల శ్రేయోభిలాషులు దొడ్ల బాలయ్య, ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ప్రభాకర్, రాజ్యలక్ష్మి, సుశీల, రామకృష్ణ, రవి, గోపాల్, స్వప్న, నర్సిరెడ్డి, సత్యనారాయణ, గణేష్, ఛాత్రోపాధ్యాయులు ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు.

వినాయక్‌నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

- **మున్సిపల్ కమిషనర్‌కు వినతి**

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని వినాయక్‌నగర్ కాలనీలో గల సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా నీటి సమస్య, డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలపై విన్నవించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ.. ఈ వేసవికాలంలో నీటి సమస్య రాకుండా చూసుకుంటామని, తగినన్ని వాటర్ ట్యాంకర్‌లను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. మిగతా సమస్యలపై నిధులు వచ్చాక ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చింతల లింగం, కోశాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ రవీందర్, విజయ్ రెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్ రెడ్డి , డి.రాజు, రిపోర్టర్ సంజీవ్, నర్సయ్య, ప్రవీణ్, రాకేష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మూడురోజుల జైలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వ్యక్తి మద్యం త్రాగి ద్విచక్ర వాహనం నడిపిన ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్నారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇందల్ వాయి ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గన్నారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదే సమయంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా అతిగా మద్యం సేవించినట్లు ధృవీకరించుకుని నిజామాబాద్‌లోని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా కోర్టు మూడు రోజులు జైలు శిక్ష విధిచడం జరిగిందని ఆయన వివరించారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఎడపల్లి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరటూరి సత్యనారాయణ అన్నారు. మండలంలోని జైతాపూర్ గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించకుండా గిట్టుబాటు ధర కోసం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి లాభాలు పొందాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జైతాపూర్ సహకార సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ ధన్వాల్, మండల వ్యవసాయాధికారి సిద్ది రామేశ్వరరావు, సహకార సంఘం కార్యదర్శి సుభాష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-తాడ్వాయి



మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని, స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంగోజివాడి పాఠశాలకు చెందిన ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి విద్యార్థులు ట్విినింగ్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం సందర్శించారు. గ్రంథాలయంలో పుస్తకా, పత్రికల, రీడింగ్, గదులను పరిశీలించారు. ఉద్యోగాలకు, పైచదువులకు ఉపయోగపడే పుస్తకాలను దిన, వార, పక్ష, మాస, తదితర పత్రికలను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో, కంప్యూటర్, గదితో పాటు తదితర గదులను పోలీసు సిబ్బంది విధులను పరిశీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, ఆర్.రాజాగౌడ్, ప్రధానోపాధ్యాయులు మురళి, జమీల్ అహ్మద్, ఆంజనేయ ప్రసాద్, ఇన్‌చార్జి గ్రంథపాలకుడు రాజలింగం, మండల విద్యాశాఖ సిబ్బంది నరసింహులు, రాజేందర్, ఏఎస్ఐ కొండల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.